క్లుప్తంగా

సమ్మె జయప్రదానికి పిలుపు



బొద్దపువానిపాలెంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: ఈ నెల 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో ఉపాధి హామీ కూలీలు పాల్గొని, సమ్మెను విజయవంతం చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. బొద్దపువానిపాలెం పని ప్రదేశంలో మంగళవారం ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు బడ్జెట్‌లో నిధులు పెంచి, బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనంగా రూ.600లతో 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. పనిచేసే ప్రదేశంలో అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదంలో మరణించిన కూలీలకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని, సిబ్బందిపై రాజకీయ వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం విజయనగరానికి చెందిన డాక్టర్ వెంకటేశ్వరరావు దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందించారు. సింహగిరికి వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్‌లో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు బాండ్ అందించారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వరాహనరసింహం పాల్గొన్నారు.

పద్యాలు నేర్చుకుందాం రండి..



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం కథలు చదవడం, రాయడం, పద్యాలు–భావాలు చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జానకిరామ్ చిన్నారులకు నీతి కథలు బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. బి.లక్ష్మీతేజ విద్యార్థులతో యోగాసనాలు అభ్యసనం చేయించారు. బొమ్మలు వేయడం నేర్పించారు. ఇంగ్లిష్ గ్రామర్, ఇతర అంశాలపై విద్యార్థులకు తర్ఫీదునిచ్చారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ



అక్కిరెడ్డిపాలెం కూడలి వద్ద విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరిస్తున్న సిబ్బంది

పెందుర్తి: గుర్రంపాలెం పంచాయతీ అక్కిరెడ్డిపాలెం కూడలి వద్ద ఈదురు గాలులకు తాటిచెట్టు పడి విరిగిన రెండు విద్యుత్ స్తంభాలను ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది మంగళవారం పునరుద్ధరించారు. సోమవారం సాయంత్రం అక్కిరెడ్డిపాలెం ప్రాంతంలో తీవ్రమైన ఈదురు గాలుల తాకిడికి తాటిచెట్టు విద్యుత్ తీగలపై పడింది. దీంతో రెండు స్తంభాలు కూలిపోయాయి. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు వాటి స్థానంలో నూతన స్తంభాలను ఏర్పాటు చేశారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులను వేంజేపచేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

తాడి తరలింపు.. సర్వేలతోనే సరి!

తాడి.. విశాఖ జవహర్‌లాల్ నెహ్రూ(జేఎన్) ఫార్మాసిటీ కాలుష్య కోరల్లో చిక్కుకుని దాదాపు 15 ఏళ్లుగా విలవిల్లాడుతున్న గ్రామం. సురక్షిత ప్రాంతానికి తరలించాలన్న వీరి డిమాండ్ కలగానే మిగిలింది. ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ సర్వేలతో సరిపెడుతున్నారు. దీంతో ఫార్మా పరిశ్రమల రసాయన వ్యర్థాల వాసన, గ్యాస్ లీకేజీలు, బాయిలర్, రియాక్టర్ల పేలుళ్లతో భయం గుప్పిట్లో ప్రజలు బతుకులు వెళ్లదీస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మరోసారి సర్వే నిర్వహిస్తోంది. ఈసారైనా తమను సురక్షిత ప్రాంతానికి తరలిస్తే చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- ఏళ్ల తరబడి కాలుష్యం కోరల్లో తాడి గ్రామం
- తరలింపుపై మళ్లీ సర్వే పేరిట తాత్సారం
- ఈసారైనా సురక్షిత ప్రాంతానికి తరలించేనా?
- ఆశలు పెంచుకుంటున్న బాధిత గ్రామస్తులు



2019 సర్వే లెక్కలు

మొత్తం నిర్వాసితులు 1289 మంది	స్థానికులు 787 మంది
స్థానికేతరులు 502 మంది	ఒక్కొక్కరికి ఇచ్చే స్థలం 5 సెంట్లు
పునరావాసానికి సేకరించిన స్థలం 15 ఎకరాలు	మేజర్ బిడ్డలుంటే.. 3 సెంట్లు
	కేటాయించిన నిధులు రూ.67 కోట్లు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీ కాలుష్య బాధిత తాడి, చినతాడి, పెదతాడి తరలింపుపై మీనమేషాలు కొనసాగుతున్నాయి. ఫార్మా వ్యర్థ రసాయనాలతో భూగర్భ జలాలు విషతుల్యమై, తీవ్ర అనారోగ్యాలకు గురై ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అవకాశం ఉన్నవారు ఇప్పటికే వలసబాట పట్టారు. కాలుష్య కాసారాల మధ్య బతకడం కష్టమని భావించిన గ్రామ ప్రజలు తమను సురక్షిత ప్రాంతానికి తరలించాలని 2012 నుంచి పోరాటాలు చేస్తున్నారు. ప్రజల అభ్యర్థన మేరకు 2019లో తొలిసారి సర్వే జరిపారు.

1289 మంది నిర్వాసితులు

2018 సర్వేలో 1289 మందిని నిర్వాసితులుగా గుర్తించారు. ఇందులో 787 మంది స్థానికులుగా, 502 మంది ఇక్కడ ఇళ్లను వదిలి వలస వెళ్లిన స్థానికేతరులుగా గుర్తించారు. ఒక్కొక్కరికి 5 సెంట్ల స్థలం, మేజర్లయిన బిడ్డలకు 3 సెంట్ల స్థలం కేటాయించాలని ప్రతిపాదించారు. నిర్వాసితుల పునరావాసం కోసం పెదముషిడివాడలో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించారు. అందులో నివాస భవనాలతో పాటు సామాజిక భవనాలు, పాఠశాల, ఆస్పత్రి, రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని పేర్కొన్నారు. అప్పట్లో పునరావాస కల్పనకు రూ.67 కోట్ల నిధులకు ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఆ నిధుల్లో రూ.56 కోట్లు పునరావాస చర్యలకు, రూ.11 కోట్లు స్థల అభివృద్ధికి వెచ్చించాలని పేర్కొంది. అంతలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. ఆ తర్వాత కరోనాతో రెండేళ్లు గడిచిపోయాయి. మళ్లీ 2024 ఎన్నికల హామీగా ఇదే అంశం తెరపైకి వచ్చింది.

రీసర్వేతో లెక్కలు మారనున్నాయ్!

తాజాగా కూటమి ప్రభుత్వంలో తాడి తరలింపునకు రీసర్వేను ప్రతిపాదించారు. ఏప్రిల్ 28 నుంచి ఇందుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుత రీ సర్వేలో ఖచ్చితమైన ఆధారాలుంటేనే నిర్వాసితునిగా గుర్తించాలని నిర్ణయించారు. ఇందుకు గ్రామంలో ఇంటి పన్నులు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు తదితరాలతో సొంతిల్లు కలిగిన వారిని మాత్రమే నిర్వాసితులుగా నమోదు చేస్తున్నారు. అనధికార నిర్మాణాలకు చోటివ్వట్లేదు. 2019 తర్వాత మేజర్లయిన బిడ్డల(కొడుకులు, కూతుర్లు)ను కలిపితే ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో ముందుగా పెదముషిడివాడలో సేకరించిన స్థలం కంటే అదనంగా మరి కొంత స్థలాన్ని సేకరించాల్సి ఉంది. పెదముషిడివాడలోని స్థలంలో కొంత భాగాన్ని జగనన్న కాలనీ కోసం కేటాయించడంతో స్థల సమస్య తలెత్తింది. ప్రత్యామ్నాయంగా ఈ మత్రిపాలెం దరి గంగవరం వద్ద మరికొంత స్థలాన్ని సేకరించాలని రెవెన్యూ అధికారులు యోచిస్తున్నారు. ఈసారైనా తాడి ప్రజల ఆశలు నెరవేరతాయో.. లేదో చూడాలి.



రీ సర్వేను పర్యవేక్షిస్తున్న పరవాడ తహసీల్దార్ అంబేడ్కర్(ఫైల్)



తాడి తరలింపు కోసం పెదముషిడివాడలో కేటాయించిన ప్రభుత్వ భూమి

నమ్మకం కలుగుతోంది



గతంలో జరిపిన సర్వేకు ప్రస్తుత సర్వేకు వ్యత్యాసం ఉంది. ఇంటి పన్నులు, కొలతలు, ఆధార్, రేషన్ కార్డులు ఉన్నవారినే గుర్తించారు. పరిశ్రమల కాలుష్యంలో చిక్కుకున్న తాడి, చినతాడి, పెదతాడి గ్రామాలను పక్కాగా తరలిస్తారన్న నమ్మకం కలుగుతోంది. అయినప్పటికీ సర్వే పూర్తయి, సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలన్న ఆశ.

– కర్రి లక్ష్మి, గృహిణి, తాడి కాలనీ

హామీ నెరవేరితే చాలు



ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఎన్నికల ముందు తాడిని తరలించి తీరుతామని హామీ ఇచ్చారు. ఆయన హామీ నెరవేరుతుందన్న నమ్మకం ఉంది. గతంలో గ్రామాభివృద్ధికి ఇతోధికంగా సాయపడ్డారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సర్వే జరిపిస్తున్నారు. ఈ సర్వేతోనైనా ఎమ్మెల్యే హామీ నెరవేరితే.. అంతకన్నా కావాల్సింది ఏముంది.

– కె.అప్పారావు, స్థానికుడు, పెదతాడి

పక్కాగా సర్వే నిర్వహణ



కలెక్టర్ ఆదేశాల మేరకు తాడి గ్రామ తరలింపు కోసం రీసర్వే నిర్వహిస్తున్నాం. నిర్వాసితుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. నిర్వాసితుల పునరావాసానికి పెదముషిడివాడలో స్థల సేకరణ జరిగింది. అక్కడ స్థల సమస్య తలెత్తితే మరో చోట ప్రభుత్వ స్థలాన్ని సేకరించి, కేటాయించే అవకాశం ఉంది.

– ఎస్వీ అంబేడ్కర్, తహసీల్దార్

‘రోడ్ల నిర్మాణానికి అడ్డంకులు తొలగించండి’

పెందుర్తి: వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో ఉన్న రోడ్ల నిర్మాణానికి ఉన్న అడ్డంకుల్ని తొలగించి, అన్ని విధాలా మార్గాలను సుగమం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ హరేందిరప్రసాద్ ఆదేశించారు. జుత్తాడ–అడవివరం, వేపగుంట–పినగాడి, శీలానగర్–నరవ–సబ్బవరం రోడ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయా రోడ్ల నిర్మాణానికి ఉన్న అడ్డంకుల గురించి ఆరా తీశారు. రోడ్ల నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోతున్న వారికి తగిన పరిహారం ఇవ్వడంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, తగు న్యాయం చేస్తామని చెప్పారు. వేపగుంట ప్రాంతంలో వీఎంఆర్‌డీఏ పరిధిలో ఉన్న భూముల యజమానులకు తగిన న్యాయం చేయాలని స్థానిక కార్పొరేటర్ బల్ల శ్రీనివాస్ కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ వెంట వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, రెవెన్యూ, అటవీశాఖ, నీటిపారుదలశాఖ అధికారులు ఉన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందర ప్రసాద్

ఘనంగా రోళ్ల పైడిమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఏపీ అయిల్‌ఫెడ్ చైర్మన్ గండి బాబ్జి



అమ్మవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అదీప్‌రాజ్

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో 110 ఏళ్ల క్రితం వెలసిన 9 గ్రామాల ఆరాధ్య దేవత రోళ్ల పైడిమాంబ అమ్మవారి వార్షిక పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష అభిషేకాలు జరిపారు. అనంతరం పసుపు–కుంకుమలు, చీరలు పెట్టి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఏపీ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, వైఎస్సార్‌సీపీ నేత గండి రవికుమార్, కార్పొరేటర్ ముమ్మన దేముడు, ఆలయ కమిటీ ప్రతినిధులు, వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎన్టీపీసీలో ఉత్కంఠగా మాక్ డ్రిల్

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో రాష్ట్ర పోలీస్ కమాండో విభాగం ఆక్టోపస్ ఆధ్వర్యంలో ‘ఆపరేషన్ థండర్’మాక్ డ్రిల్‌ను మంగళవారం ఉత్కంఠగా నిర్వహించారు. అత్యవసర పరిస్థితిలో పోలీస్ యంత్రాంగం స్పందించాల్సిన తీరుపై ఈ మాక్‌డ్రిల్ కొనసాగింది. మాక్ డ్రిల్‌లో భాగంగా ఆరుగురు ఉగ్రవాదులు ఆయుధాలతో ఎన్టీపీసీలో చొరబడి, బహిరంగ కాల్పులు జరిపారు. సమాచారం అందుకున్న ఆక్టోపస్ బృందం వెంటనే స్పందించి వ్యూహాత్మక ఆపరేషన్ ప్రారంభించింది. ఉగ్రవాదులను న్యూట్రలైజ్ చేసి వారి చేతిలో బందీలుగా ఉన్న వారిని రక్షించింది. మాక్ డ్రిల్ నిర్వహణ కోసం ముందుగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రాజ్‌కుమార్, ఆక్టోపస్ అదనపు పోలీస్ అధికారి రాజారెడ్డి, పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ ఆర్.మల్లికార్జునరావు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, వైద్య సిబ్బంది, రెవెన్యూ, సేఫ్టీ అధికారులు, అనకాపల్లి ఏఆర్ విభాగానికి చెందిన బీడీ టీం, డాగ్ స్క్వాడ్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న ఆక్టోపస్ బృందం

అంగరంగ వైభవంగా అమ్మవార్ల పండగ



రాయపుర అగ్రహారంలో క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందిస్తున్న అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారంలో కొలువైన పరదేశమ్మ, సబ్బవరం శివారు పెదనాయుడుపాలెంలోని మర్లమాంబ అమ్మవార్ల పండగ మహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. వేకువజాము నుంచి భక్తులు బారులుదీరి అమ్మవార్లకు పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాయపుర అగ్రహారంలోని పరదేశమ్మను మాజీ ఎమ్మెల్యే, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్టీ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. విలేజ్ క్రికెట్ టోర్నీ విజేతకు గ్రామ సర్పంచ్ పిల్లల అప్పలనాయుడుతో కలిసి బహుమతులు అందించారు. పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, బోకం రామునాయుడు, అధికార ప్రతినిధి కొటాన రాము, మండల కన్వీనర్ కర్రి బాబు, సబ్బవరపు ముత్యాలనాయుడు, పాలిశెట్టి సురేష్ రాజ్, గాలిభీమవరం సర్పంచ్ గొర్లి రాజేష్, మసలయ్య, వెంకటరమణ, గవర రాజు, సిరపరపు వాసు, నక్కెళ్ల అచ్చిబాబు పాల్గొన్నారు.

‘పింఛన్ల పంపిణీ’ నుంచి మినహాయించండి

ఎంపీడీవోకు అంగన్‌వాడీ వర్కర్ల వినతి

సబ్బవరం: అంగన్‌వాడీ వర్కర్లను పింఛన్ల పంపిణీ విధుల నుంచి మినహాయించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పద్మజకు మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధి రమణమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్‌కు పలు రకాల యాప్స్‌తో పనిభారం పెరిగిందన్నారు. అయినా ప్రభుత్వం వచ్చిన కొత్తలో గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో భాగంగా సచివాలయ సిబ్బందికి రెండు మూడు నెలలు సహకరించాలని కోరడంతో అంగీకరించామన్నారు. ఏడాది కావస్తున్నా.. ఇప్పటికీ పింఛన్ల సొమ్మును కూడా తమకే ఇచ్చి పంపిణీ చేయాలని చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1వ తేదీ నుంచి పిల్లల బరువులు చూడటం, టీహెచ్ఆర్ పంపిణీ, పోషకాహారం వండి పిల్లలకు పెట్టడం, ప్రీ స్కూల్ నిర్వహణ, యాప్‌లలో వివరాల అప్‌లోడ్ తదితర పనులతో సతమతమవుతున్నట్లు పేర్కొన్నారు. అదే సమయంలో పింఛన్ల పంపిణీ నగదుతో కూడుకున్న పనికావడంతో ఏ చిన్న పొరపాటు జరిగినా, తమ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల గుంటూరులో రాజకీయ జోక్యం వలన ఒక వర్కర్‌ను సస్పెండ్ చేశారని, ఈ అదనపు పనులు అంగన్‌వాడీ సెంటర్ విధుల నిర్వాహణకు ఆటంకంగా ఉంటున్నాయన్నారు. ఈ నేపథ్యంలో తమ పరిస్థితిని అర్థం చేసుకుని, పింఛన్ల పంపిణీ విధుల నుంచి అంగన్‌వాడీ వర్కర్స్‌ను మినహాయించాలని కోరారు.



ఎంపీడీవో పద్మజకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు

దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పెందుర్తి: దేశంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఏకంగా 44 లేబర్ చట్టాలను రద్దు చేసి కార్మికుల హక్కులను కాల రాస్తున్నారని ఏఐటీయూసీ నేత వై.రాంబాబు ఆరోపించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు పెందుర్తి, రాచ్చెరువు ప్రాంతాల్లో ఆటో స్టాండ్‌ల వద్ద సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించే జీవో 21ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నేత ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రైవర్లకు ఉరితాడు లాంటి మోటార్ వాహన చట్టాన్ని రద్దు చేసేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఆటోస్టాండ్‌ల ప్రతినిధులు, ఏఐటీయూసీ సభ్యులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో మహిళా పోలీసులు కీలకం

గ్రామ/వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులతో సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో అత్యంత కీలకంగా విధులు నిర్వహిస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ సూచించారు. క్షేత్రస్థాయిలో అసాంఘిక కార్యకలాపాలు, ఇతర నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చినముషిడివాడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గ్రామ/వార్డు సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులకు మంగళవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి, బెల్ట్ దుకాణాల్లో మద్యం అమ్మకాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాల సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలన్నారు. సచివాలయాల పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతర నేర నియంత్రణ ప్రక్రియపై ప్రజలకు తగిన అవగాహన కలిగించాలన్నారు. సున్నితమైన మైనర్లపై అత్యాచారాలు, బాల్యవివాహాలు, గృహహింస, చిల్లర నేరాలపై కూడా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, సమాచారం ఉన్నతాధికారులకు చేరవేయాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో బాధితులకు, రిఫరల్ సేవలకు తగిన సహకారం అందించేందుకు మహిళా సంరక్షణ కార్యదర్శులు ప్రధాన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పలువురు అధికారులు, పోలీస్ సిబ్బంది, పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ/వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

దివ్యాంగ పిల్లలకు సదుపాయాల కల్పన

పెందుర్తి: 18 ఏళ్ల లోపు దివ్యాంగ పిల్లలకు భవిత కేంద్రంతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో తగిన సదుపాయాలు కల్పిస్తున్నట్లు జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గీత తెలిపారు. సమగ్ర శిక్ష అదేశాల మేరకు పెందుర్తి భవిత కేంద్రం ఆధ్వర్యంలో 0–18 ఏళ్ల దివ్యాంగ బాలబాలికల గుర్తింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగ పిల్లల కోసం ప్రభుత్వం అనేక వసతులు సమకూర్చుతోందన్నారు. భవిత కేంద్రంతో పాటు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలను చేర్పిస్తున్నామని పేర్కొన్నారు. ఏపీవో అప్పలనాయుడు, ఐఈ ఉపాధ్యాయుడు బి.ఎ.బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



భవిత కేంద్రం దివ్యాంగ పిల్లల గురించి తెలుసుకుంటున్న సహిత విద్య సమన్వయకర్త గీత

సీబీఎస్ఈలో బాలభారతి విద్యార్థుల ప్రతిభ



దీపిక మండల్ 487/500



అలుగోలు కావ్యశ్రీ 478/500



మల్లారెడ్డి వేదప్రియ 477/500



బొండా జోష్విక్ 476/500

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్‌లోనిబాలభారతి పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వాసంతిదేవి తెలిపారు. 2024–25లో విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలకు చెందిన దీపిక మండల్(487/500), అలుగోలు కావ్యశ్రీ(478/500), మల్లారెడ్డి వేదప్రియ(477/500), బొండా జోష్విక్(476/500) అత్యుత్తమ మార్కులు సాధించినట్లు వెల్లడించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు, ఎన్టీపీసీ యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.